

1వ తేదీ వరకు
శనగలు, కందుల కొనుగోలు నిలిపివేత

బోథ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న కందులు, శనగల కొనుగోలును ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు సహకార సంఘం సీఈవో గోలిస్వామి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పంటలను మార్కెట్ తీసుకురావద్దని సీఈఓ పేర్కొన్నారు. తిరిగి రెండోతేదీన కొనుగోలు ప్రారంభమవుతాయని వివరించారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని సహకరించాలని కోరారు.

క్షయవ్యాధి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా


రోగులకు కిట్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వైద్యం అందించి వ్యాధి తీవ్రతను తగ్గించే ఆస్కారం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వరల్డ్ టీబీడే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులకు పోషణ్‌కిట్స్ పంపిణీ చేశారు. క్షయవ్యాధి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, టీబీ జిల్లా అధికారి సుమలత తదితరులున్నారు.

హెచ్-1 యూనియన్ డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 యూనియన్ ఆదిలాబాద్ జిల్లా 2025 డైరీ, క్యాలెండర్ శుక్రవారం కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. నిబద్ధతతో రోగులకు సేవలందించాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుంటానన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెంట్ డాక్టర్ అశోక్, డీటీసీవో సుమలత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, డీఎల్ఓ డాక్టర్ గజానన్, డీఎంఓ డాక్టర్ శ్రీధర్ మెట్‌పల్లివార్, డాక్టర్ సందీప్‌జాదవ్ పాల్గొన్నారు.





డోంట్‌వర్రీ.. తవ్వేసుకోండి!

▸ జిల్లాలోని కజ్జర్ల అసైన్డ్ భూముల్లో ఆగని మొరం తవ్వకాలు ▸ ఢిల్లీ పెద్దల ఒత్తిళ్లతో ఆగమేఘాల మీద అనుమతులు ▸ అధికారుల అండతో రెచ్చిపోతున్న కాంట్రాక్టర్ కంపెనీ ▸ ల్యాండ్ లెవలింగ్ ఒప్పందంలో మధ్యవర్తుల దళారీ దందా ▸ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు అధికార పార్టీ నేతల ఫిర్యాదు ▸ చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

ఆదిలాబాద్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కజ్జర్ల అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా.. అధికారులు మాత్రం మౌనంగానే ఉండిపోతున్నారు. పైగా 'డోంట్‌వర్రీ తవ్వేసుకోండి' అంటూ సంబంధిత కాంట్రాక్టర్ కంపెనీకి పరోక్ష సహకారాన్ని అందిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసమే అనుమతులు ఇచ్చామని అధికారులు చెబుతున్నా.. పర్యవేక్షణ లేకపోవడంతో మొరం మట్టిని పక్కదారి పట్టిస్తూ అమ్మేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల్లో ఎలాంటి కమర్షియల్ కార్యకలాపాలు చేపట్టేందుకు అవకాశమే ఉండదు. కానీ అంతా మా ఇష్టం అన్నట్లుగా జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దేని ఆధారంగా అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారంటూ ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకుండా సైలెంట్‌ైపోతున్నారు. దీన్నిబట్టి చూస్తుంటే అధికారుల తీరు ఏవిధంగా ఉందో తెలుస్తూనే ఉంది. మొరం క్వారీలకు అనుమతులు ఇచ్చిన విషయాన్ని గోప్యంగా ఉంచడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్ భూముల్లో అక్రమంగా జరుగుతున్న మొరం తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులే అడ్డదారిలో అనుమతులు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.




● తలమడుగు మండలం కజ్జర్ల శివారులోని అసైన్డ్ భూముల్లో చేపడుతున్న మొరం తవ్వకాలు

'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'అనుమతుల పేరిట అడ్డగోలు దందా' అనే ప్రత్యేక వార్త కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు కొంత హడావుడి చేసినా.. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో మళ్లీ సైలెంట్‌ై పోయినట్లు తెలుస్తుంది.

తలొగ్గిన అధికారులు

గత కొన్ని రోజులుగా మొరం క్వారీ అనుమతుల కోసం శ్రీశివసాయి సర్వీసెస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముమ్మర ప్రయత్నాలు చేసింది. అయినా జిల్లా అధికారులు పట్టించుకోలేదు. మార్చి 13న దరఖాస్తు చేసుకున్న వెంటనే అధికారులు ఆగమేఘాల మీద అనుమతులు ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ స్థాయి ఉన్నతాధికారుల ఒత్తిళ్లతోనే జిల్లా అధికారులు మొరం క్వారీలకు అనుమతులు ఇవ్వాల్సి వచ్చిందన్న ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత రోడ్డు నిర్మాణ సంస్థ ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడంతోనే జిల్లా అధికారులు దారికొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల్లో అనుమతులు ఇచ్చే అవకాశం లేకపోవడంతో అడ్డదారిలో దళిత రైతుకు చెందిన ల్యాండ్ లెవలింగ్ పేరుతో ఒప్పందం చేసుకుని అనుమతులు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా నిబంధనలకు విరుద్ధమేనని సంబంధిత శాఖల అధికారులకు తెలిసినా.. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు.

రాత్రీ, పగలు దోపిడీ దందా

అధికారులే అండగా నిలవడంతో రాత్రీ, పగలు అనే తేడా లేకుండా కాంట్రాక్టర్ కంపెనీ దోపిడీ దందాకు ఎగబడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా.. కాంట్రాక్టర్ తీరులో మార్పు కనిపించడం లేదంటున్నారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మొరం మట్టిని తరలించేందుకు అధికారులు అనుమతినిచ్చారు. కానీ పగలు, రాత్రి రెండు షిఫ్టుల్లో మొరం మట్టిని అడ్డగోలుగా తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా అడిగేందుకు జంకుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు సింగిల్ వే కావడంతో రాత్రిళ్లో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఒకవేళ జరగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవర న్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఓవర్ లోడ్‌తో భారీ వాహనాలలో మొరం మట్టిని తరలిస్తున్నా.. పోలీసులు, ఆర్టీఏ



(తరువాయి 6వ పేజీలో...)

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న చిన్నారులు

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, మార్చి, 28 (ఆంధ్రజ్యోతి) : తానూ ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించానని బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మీరంతా ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో రాజ కీయా ల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా పాఠ శాల విద్యార్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం డీఈఓ ప్రణీత మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించి ఉత్కృష్టమ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు బద్దం సురేందర్ రెడ్డి, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు గంగాధర్, సల్ల భోజరెడ్డి, పిప్రి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఆదిలాబాద్ బైపాస్ నుంచి నిర్మల్ బైపాస్ వరకు కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరిశీలించారు. తారురోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేసి డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ నిమ్మల దమ్మరెడ్డి ప్రీతంరెడ్డి, నాయకులు పాండురంగ్, దేవేందర్‌రెడ్డి, నానక్‌సింగ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నేరడిగొండ : సిరికొండ మండల కేంద్రంలో గల జామమసీదులో జరుగుతున్న పనులకు ప్రభుత్వం నుంచి రూ.ఐదులక్షలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు ప్రతిపాదనలు అందజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిరికొండ మాజీ సర్పంచ్ పెంటన్న, మాజీ ఎంపీటీసీ ఎక్బాల్, మాజీ ఉపసర్పంచ్ చందు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
● ఆదిలాబాద్‌లో సీసీఐని సందర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి


అభివాదం చేస్తున్న సీసీఐ సాధన సమితి నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చి విస్మరించారని, వారు తమ పదవులకు రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీని శుక్రవారం సీసీఐ సాధన సమితి నాయకులతో కలిసి సందర్శించారు. అయితే పోలీసులు నాయకులను సీసీఐలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినా వారిని లెక్క చేయకుండా లోనికి వెళ్లారు. ఫ్యాక్టరీ ముందు అభివాదం చేస్తు పునఃప్రారంభించే వరకు ఐక్యంగా ఉద్య మిస్తామని నినాదాలు చేశారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లా డుతూ... జిల్లాకు ఉన్న ఒకే ఒక ఫ్యాక్టరీ సీసీఐని 20 సంవత్సరాల నుంచి మూత వేశారన్నారు. ఎన్నికల సమయంలో అమిత్ షా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు గెలిపిస్తే సీసీఐని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూడా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం చేసేలా యత్నాలు సాగుతున్నాయన్నారు. ఫ్యాక్టరీకి 700 ఎకరాల భూమి ఉం దని, పది వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. పునరుద్ధరణకు ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. సాధన సమితి ఉద్యమాలకు తమ పార్టీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

సోనాల బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని వినతి

సోనాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సోనాల బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని పలువురు సోనాల గ్రామానికి చెందిన నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీవో అతుల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను కలిసి వినతి పత్రం అందజేశారు. అప్పట్లో తులనారాయణ జ్ఞాపకార్థం బస్టాండ్ నిర్మించారని దానిని మరమ్మతులు చేపట్టి అలాగే మహిళలకు మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలన్నారు. సోమన్న, అమృత్ రావు, భోజన్న, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఏసీబీ వలలో డీఈఎంవో

● రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్ర జ్యోతి) : ఓ కేసు విషయంలో మెడికల్ షాపు యజమాని నుంచి రూ.30 వేలు లంచం తీసు కుంటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎక్స్‌టెన్షన్ మెడికల్ ఆఫీసర్ (డీఈఎంఓ)రవి శంకర్ శుక్రవారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్‌లో ఓ మహిళకు అబార్షన్ చేసి ఆమె మృతికి కారణమైన కేసులో మందులు ఇచ్చిన మెడికల్ షాపు యజమానిని అందులో నుంచి తప్పించడానికి సదరు అధికారి రూ.లక్ష డిమాండ్ చేశాడు. కాగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయిం చడంతో శుక్రవారం రూ.30వేలు అధికారికి ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డబ్బును స్వాధీనం చేసుకొని అధికారిని అరెస్ట్ చేశారు. డీఈఎంఓను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. కాగా నెలరోజుల వ్యవధిలో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడం కలకలం రేపుతోంది.

బోథ్ : అధికారి రవిశంకర్ గురువారం మండలంలోని పలు క్లీనిక్‌లను, డయాగ్నోస్టిక్ సెంటర్‌లను సీజ్ చేశారు. అయితే అదే అధికారి శుక్రవారం ఏసీబీకి లంచం తీసుకుంటూ దొరికిపోవడం గమనార్హం. ఆయా మండల కేంద్రాలకు వచ్చిన రోజు ఎంతో నిజాయితీగల అధికారిగా వ్యవ హరించిన ఈయన మరుసటి రోజు లంచం తీసుకుంటూ దొరకడంతో అధికారి తీరుపై విస్మయం వ్యక్తం అవుతోంది. క్లీనిక్‌ను సీజ్‌చేయడం వెనుక వేరే కారణాలున్నాయా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన డీఈఎంవో రవిశంకర్

పాత ఆయిల్ మిల్లులో మంటలు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గౌరీ శంకర్ పాత ఆయిల్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆయిల్ మిల్ లోపలి భాగంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు భారీగా ఏగసి పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు కింద ఉన్న ప్లాస్టిక్‌కు మంటలు అంటుకున్నాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పివేశారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి

● నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ● హోటళ్లలో అధికారుల తనిఖీలు


హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించే హోటళ్లు, స్వీట్‌హోమ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్‌సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, స్వీట్స్ హోమ్స్‌పై దాడులు నిర్వహించారు. తిను బండారాలను పరిశీలించి హెచ్చరికలు చేస్తూ జరిమానాలు విధించారు. వినాయక్‌చౌక్‌లోని ఓ స్వీట్స్ హోమ్‌ను తనిఖీ చేయగా పాత స్వీట్లను కొత్త స్వీట్లతో కలిపేందుకు సిద్ధం చేసినట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీరికి జరిమానాలతోపాటు హెచ్చరికలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే హోటళ్లు, స్వీట్‌హోమ్స్ కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మరోసారి తనిఖీలో ఇలాంటివే పునరావృత్తం అయితే సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

'జెండాను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఇంద్రవెల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కుల గురువు గొండి ధర్మగురు హీరాసుక్క జెండాను తొలగించి దహనం చేసిన దుండ గులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పర్ధాన్ సమాజ్ పెద్దలు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హీరాసుక్క జెండాను తొలగించడంతో శుక్రవా రం ఉదయం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని తొలగించిన మీరాసుక్క జెండాను పరిశీలించారు. కావాలనే జెండాను తొలగించి దహనం చేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన ఆందోళనలు చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం పర్ధాన్ సమాజ్ నాయకులు, పెద్దలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పర్ధాన్ సంఘం తెలం గాణ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గ నగేష్, జిల్లా అధ్య క్షులు ఉయిక సుదర్శన్, శంకర్ తదితరులున్నారు.

'మా సంప్రదాయాలను రక్షించండి'

ఉట్నూట్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): గోండ్‌వానా దేవి, దేవతలకు ప్రభుత్వాలు గుర్తింపు కల్పించాలని కోయ పున్నేం గోండ్వానారాయి దర్బార్ డిమాండ్ చేసింది. ఉట్నూర్ మండలంలోని మత్తడి గూడలో శుక్రవారం రాయిదర్బార్ జరిగింది. గోండ్వాణ దేవి, దేవతలకు ప్రభుత్వ గుర్తింపు కోసం ఈ కార్యక్రమం జరిగిందని, తమ సంస్కృతి, సంప్రదాయాలు రక్షించాలని వక్తలు పేర్కొన్నారు.

ఉట్నూర్‌లో జై సంవిధాన్

ఉట్నూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను హేళన చేసి మాట్లాడడం సరికాదన్నారు. అదే క్రమంలో రాహుల్‌గాంధీ భారత్ జోడ యాత్ర చేయడం, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో ముం దకు వెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ సర్పంచ్‌లు మర్సుకోల తిరుపతి, జాదవ్‌జగదీశ్, కళావతి పాల్గొన్నారు.

సుపారీ తీసుకున్న వ్యక్తి రిమాండ్

ఇచ్చోడ, మార్చి, 28 (ఆంధ్రజ్యోతి) : ఒకరి నుంచి డబ్బులు(సుపారీ) తీసుకొని మరొకరిని చంపాలని బెదిరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఇచ్చోడ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామానికి చెందిన గొల్లెన రాజేందర్, మేకల దేవేందర్‌లకు భూమి విషయంలో గత నెల గొడవ జరిగింది. ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని ఇచ్చోడ గ్రామానికి చెందిన షేక్ సోహెల్‌తో దేవేందర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. రాజేందర్‌ను చంపేయమని సోహెల్‌కు దేవేందర్ సుపారి (డబ్బులు) అందజేశాడు. సుపారి తీసుకున్న సోహెల్ ఇచ్చోడలోని మొబైల్ దుకాణం నిర్వహిస్తున్న రాజేందర్‌ను కలిసి నిన్ను చంపమని దేవేందర్ తనకు సుపారీ ఇవ్వడం జరిగిందని, తనకు డబ్బులు ఇస్తే వదిలేస్తానని లేదంటే చంపేస్తానని బెదిరించాడు. దీంతో రాజేందర్ భయపడి డబ్బులు ఇచ్చాడు.

ఇలాగే పలుమార్లు డబ్బులు ఇవ్వాలని సోహెల్ రాజేందర్‌ను బెదిరించగా బాధితుడు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోహెల్‌ను గాలించి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34 (శనివారం సాయంత్రం)
సహర్ : 4.50 (ఆదివారం ఉదయం)

మృదుత్వాన్ని, మెతక వైఖరిని అనుసరించే వారిగా ఎవరైతే ఉంటారో.. అల్లాహ్ వీరి కోసం నరకాన్ని నిషేధించాడు. కఠినత్వం, పిసినారితనం, ఓర్వలేని తనం, ద్వేషం, ఈర్ష్య లాంటి గుణాలున్న వాడికి నరకం తప్పదు.

ఢిల్లీలో సమావేశానికి హాజరైన డీసీసీ అధ్యక్షుడు


డిప్యూటీ సీఎంను కలిసిన శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల సమావేశానికి శుక్రవారం నిర్మల్ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ పరిస్థితి ఆయనకు వివరించారు. పార్ల మెంట్ సెంట్రల్ భవనాన్ని సందర్శించారు.

ఒకే దేశం ఒకే ఎన్నికతో ఆర్థిక స్థిరత్వం : బీజేపీ

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆలోచించే ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, వి. సత్యనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణం గాజులపేట్ మున్నూరు కాపు సంఘ భవనంలో ఒకే దేశం ఒకే ఎన్నికపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తరచూ జరిగే వివిధ ఎన్నికలతో ప్రభుత్వ ధనం వృధా అవుతుందన్నారు. దేశంలో అస్థిర వాతావరణం నెలకొని అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహిస్తే దేశంలో స్థిరత్వం నెలకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఖజానాపై ఆర్థికభారం తగ్గుతుందని అభిప్రాయ పడ్డారు. పారదర్శకంగా ఓటింగ్ నిర్వహిం చవచ్చునని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, ఉపాధ్యక్షుడు కమల్ నయన్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేవైఎం అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, మహేష్, గంగాధర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులను తనిఖీ చేసిన డిప్యూటీ తహసీల్దార్


పార్‌పెల్లిలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అజీజ్

లక్ష్మణచాంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు రేషన్‌షాపులను డిప్యూటీ తహసీల్దార్ అజీజ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 1వ తేదీ నుండి తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయనున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ తరుణంలో గతంలో సరఫరా చేసిన దొడ్డు బియ్యం నిల్వలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవటం కోసం కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. అలాగే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి కూడా మండలంలోని పలు రేషన్ దుకాణాలు తనిఖీ చేశారు.

తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్

ఎన్నికల్లో విజయం సాధించిన చామన్‌పెల్లి వాసి


ఎన్‌టి. లావణ్య

లక్ష్మణచాంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసి మహిళా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ఎన్‌టి. లావణ్య విజయం సాధించింది. మండలంలోని శుక్రవారం సాయంత్రం వెల్లడించిన ఫలితాల్లో లావణ్య విజయం సాధించినట్లు తెలంగాణ హైకోర్టు అసోసియేషన్ ఎన్నికల కమిటీ తెలిపింది. ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఎన్‌టి. లావణ్య ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. చిన్న వయస్సులోనే అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన లావణ్యను తోటి లాయర్లు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, ఆత్మీయులు, స్నేహితులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● పోలీసు సిబ్బందికి వైద్య శిబిరంలో నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల


వైద్యాధికారిని సన్మానిస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అనుక్షణం ప్రజల భద్రత కోసం పని చేసే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. శుక్రవారం ప్రధాన ఆసుపత్రిలో పోలీసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్పీ పోలీసుల ఆరోగ్య భద్రతకు వైద్యాధికారులతో సంప్రదించి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య పరీక్షల రిపోర్టులు అందగానే వారికి తగిన మందులు అందజేస్తానన్నారు. ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో 703 మంది పోలీసులకు వైద్య పరీక్షలు జరిపారు. వైద్య పరీక్షలకు సహకరించిన వైద్యులు, ల్యాబ్, సిబ్బందిని ఎస్పీ ప్రశంసిస్తూ సన్మానించారు. పోలీసులు, వైద్య సిబ్బంది కలిసి పని చేయాలని ఆకాంక్షించారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే

సంస్కారం సమాజానికి ఆరోగ్యకరం


మాతృ, పితృ వందనంలో తమ పిల్లల్ని ఆశీర్వదిస్తున్న తల్లులు

- మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నరేందర్‌రావు
- పిల్లలు తల్లిదండ్రులను గౌరవించేలా పాఠశాలలో వినూత్న కార్యక్రమం
- మాతృపితృ వందనం కార్యక్రమాన్ని నిర్వహించి ఆదర్శంగా నిలిచిన మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల

ఖానాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నేడు పెరుగుతున్న టెక్నాలజీతో సెల్‌ఫోన్లు, టీవీల మాయలో పడి పిల్లలు చిన్ననాటి నుంచే ఆధునిక పోకడలను అలవర్చుకొని పెద్దలంటే కనీస గౌరవ, మర్యాదలు కూడా ఇవ్వలేని పరిస్థితిని మన చుట్టూ ఉన్న సమాజంలో నిత్యం ప్రతీ ఒక్కరం చూస్తున్న చేదు నిజం... ఇటువంటి వింతపోకడల నుంచి విద్యార్థులకు విముక్తి కలిగించేలా మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు మాతృ, పితృవందనం కార్యక్రమాన్ని నిర్వహించి ఇతర పాఠశాలలకు ఈ పాఠశాల నిర్వాహకులు ఆదర్శంగా నిలిచారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. సుమారు 50 మందికి పైగా విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నరేందర్ రావు మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరిలో విద్యార్థి దశ నుండే సంస్కారం అలవర్చడం సమాజానికి ఎంతో ఆరోగ్యకరమన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న హింస, దోపిడీ, అల్లర్లన్నింటికి సంస్కారం లేకపోవడమే ప్రధాన కారణంగా నిలుస్తోందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి మంచి చేసే వారిలా తయారవ్వాలని ఏకైక లక్ష్యంతో పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని మాతృ, పితృ వందన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని పలువురు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల ఇతర పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి నాయకులు ఎర్రన్న, లక్ష్మణ్, ఉపేందర్, వెంకటేష్, టీచర్లు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, శోభారాణి, ఇమ్రాన్, ఫరాజ్, కిషన్ ప్రసాద్, విజయ్‌కుమార్, షఫీ, రవి, చందన, లక్ష్మణ్‌రావు, స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, రూప్సీరాణి, తదితరులున్నారు.

'రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోంది'

సారంగాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి. నర్సయ్య ఆరోపించారు. మండలంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు జై బాపు - జై బీమ్ - జై సంవిధాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రపై గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలకు వివరించే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు రొడ్డ మారుతి, దశరథ్ రాజేశ్వర్, ముత్యంరెడ్డి, అహ్మద్ ముక్తార్, ఎస్. సురేందర్, షేక్షఫీ కార్యకర్తలు ఉన్నారు.

వడదెబ్బతో రైతు కూలీ మృతి

భైంసా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీకి చెందిన కత్తిమోల్ల శంకర్ (52) అనే రైతు కూలీ శుక్రవారం సాయంత్రం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిసాన్‌గల్లీకి చెందిన శంకర్ గత కొంత కాలంగా వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీరు ఇచ్చేందుకు వెళ్తున్నాడు. గత ఐదారు రోజులుగా ఎండలో నీరు పారిస్తున్నాడు. శుక్రవారం సైతం మొక్కజొన్న పంటకు నీరు అందిస్తూ.. అస్వస్థతకు గురయ్యాడు. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో విఘాత జీవిగా పడిఉన్నాడు. చుట్టుపక్కల రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటన స్థలంలో మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

ఫటా..ఫట్...

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

● కదం ఆదిత్య, విద్యుత్ శాఖ ఏఈ, కుభీర్



కుబీర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని, లోవోల్టేజీ నివారణకు విద్యుత్ లైన్లు నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్) మరమ్మత్తును ఎప్పటికప్పుడు చేపడుతున్నామని విద్యుత్ శాఖ కుభీర్ మండల ఏఈ కందం ఆదిత్య వెల్లడించారు. మండలంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మర్ని విషయాలను ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుత వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

ఏఈ: వేసవిలో మూడు నెలల విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. రబీసాగు ముగింపు దశలో ఉన్నందున మండల పరిధిలోని గ్రామాల్లో కొంత మేరకు లోడ్ రిలీఫ్ అయింది. గ్రామాల్లో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టి నియంత్రికలపై అధిక భారం పడకుండా ప్రణాళికలు రూపొందించాం. విద్యుత్ వినియోగం అధికంగా ఉన్న కారణంగా అంతరాయం ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తగా కుంటాల మండలంలోని బురుగుపెల్లి సబ్‌స్టేషన్ నుంచి కుభీర్ మండలానికి సరఫరా చేసి రబీ సాగు కోసం నిరంతరం వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏఈ: మండల కేంద్రంతోపాటు మండలంలోని పార్డి(బి) సొనారి సబ్‌స్టేషన్‌లతో విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మాలేగాం గ్రామంలో మరో సబ్‌స్టేషన్ పూర్తైంది. పీటీఆర్ బిగించాం. మరోవారంలో ప్రారంభం కానుంది. డొడర్న తండాకు సబ్‌స్టేషన్ మంజూరైంది. పల్సి గ్రామంలో ఏర్పాటు కోసం నివేదికలను రూపొందించి జిల్లా అధికారులకు అందజేశాం. పైన తెలిపిన విద్యుత్ ఉపకేంద్రాలు ప్రారంభమైతే పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు ఎలాంటి అంతరాయం ఉండదు.

ఆంధ్రజ్యోతి: కాలిపోయిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు పడుతున్న సమయం?

ఏఈ: గతంతో పోలిస్తే ఈ ఏడాది నియంత్రికలు కాలిపోయే సంఖ్య చాలా వరకు తగ్గింది. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే సిబ్బంది వాటిని 24 గంటల్లో పరిష్కరించి రైతులకు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో గల అన్ని గ్రామాలో పరిధిలో గృహజ్యోతి పథకం వినియోగదారులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల వివరాలు ఉన్నాయా?

ఏఈ: మండలంలో గృహజ్యోతి పథకం వినియోగదారులు 10,408, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు 4,923, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు 1,436 ఉన్నాయి. కేటగిరి రెండుకు సంబంధించిన కనెక్షన్‌లు 822 ఉన్నాయి.

నల్లరిబ్బన్‌లను ధరించి నిరసన

ఇంద్రవెల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లిం మతపెద్దలు, మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అంజద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ 2024 బిల్లుపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక జామా మసీదు ఆవరణ ముస్లిం పెద్దలతో కలిసి చేతులకు నల్లరిబ్బన్‌లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ సూఫీయాన్, సయ్యద్ జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని మజీద్ వద్ద శుక్రవారం ముస్లింలు శాంతియుత నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ఉట్నూర్ మండలంలోని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం ముస్లిం సోదరులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

తప్పిపోయిన ఆవును యజమానులకు అప్పగింత

బోథ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద విధులు నిర్వహిస్తున్న సాయిమురళి అనే ఇరువురు యువకులకు గత మూడురోజుల క్రితం ఆవు కనిపించింది. అయితే తప్పిపోయి వచ్చిన ఆవును ప్రతి రోజు మేపారు. ఆవులు మేపుతుండగా తప్పిపోయిన ఆవు కోసం నిర్మల్ జిల్లా రానాపూర్‌కు చెందిన కాపర్లు వెతుక్కుంటూ జలపాతం వద్దకు వచ్చారు. దీంతో తప్పిపోయిన ఆవును యజమానులకు అప్పగించారు.

టీబీ రహిత పంచాయతీలకు ప్రశంసాపత్రాలు


అభయ్‌కుమార్‌కి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

భీంపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుబ్‌డి, పల్లి కరన్‌వాడి, గోన పంచాయితీలకు టీబీ ముక్త పంచాయితీగా నిలిచాయి. గతంలో వైద్య సిబ్బంది వంద రోజుల పాటు ఇంటింటా నిర్వహించారు. కాగా ఆ జిల్లా కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం గ్రామాల కార్యదర్శులు అభయ్ కుమార్, వినోద్, కార్తీక్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై సంవిధాన్

ఇంద్రవెల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో శుక్రవారం జై బాపూ... జై బీం... జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు యాకూబ్ బేగ్, సోమోరే నాగోరావు, జితేందర్, నాగనాథ్, వరుణ్, కొమురయ్య, దూదిరాం తదితరులు పాల్గొన్నారు.


జై సంవిధాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

'కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి'


సీసీ రోడ్డుపనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేగమా గ్రామంలో ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న సీసీ రోడ్డుపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఆడే గజేందర్ సహకారంతో మండలానికి రెండు కోట్ల సీసీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా ఎస్‌ఎస్ నప్పై కింద 50 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, బొల్లారపు బాబన్న, మాజీ ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు లస్మన్నయాదవ్, వెంకన్న యాదవ్, నాయకులు కాంతా రావు, సుభాష్‌రావుల నారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్ బార్‌ఎన్నికల్లో అధ్యక్షుడిగా బాపురెడ్డి ఎన్నిక


ఉట్నూర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం

ఉట్నూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ అడ్వకేట్ బాపురెడ్డి ఎన్నికయ్యారని ఎన్ని కల అధికారి కూడెల్లి అశోక్ తెలిపారు. అధ్య క్షుని రేసులో బాపురెడ్డితో పాటు జమీర్‌ఖాన్ పోటీపడగా బాపురెడ్డి విజయం సాధించారన్నారు. ప్రధాన కార్యదర్శిగా జయవంతు రావు, ఉపాధ్యక్షులుగా బానోత్‌జగన్‌నాయక్, కోశాధికారిగా కురెవెత శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా భీమానాయక్, క్రీడాకార్యదర్శిగా తిరుపతి, కార్యవర్గస భ్యులుగా వసంతరావులు ఎన్నికయ్యారన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక

బోథ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బోథ్ కోర్టులో శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఎక్కువ జరిగాయి. అధ్యక్షులుగా వామన్ రావు దేశ్పాండే, ఉపాధ్యక్షులుగా దమ్ముపాల్, ప్రధాన కార్యదర్శిగా పంద్రం శంకర్, ట్రెజరర్‌గా ఆడేపు హరీష్, జాయింట్ సెక్రటరీగా కుమ్మరి విజయకుమార్, మహిళ ప్రతినిధిగా గంగాసాగర్, స్పోర్ట్స్ సెక్రటీగా వివేక్ సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ ఏడాది కాలం పాటు కొనసాగుతుందని వివరించారు.

కూతురితో మాట్లాడుతున్నాడని యువకుడి కిడ్నాప్

● 9మంది పై కేసు ,ఆరుగురి అరెస్టు ● వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తన కూతురితో మాట్లాడుతున్నాడనే కోపంతో తండ్రి ఓ యువకుడిని కిడ్నాప్ చేశాడు. ఆ పై గదిలో బంధించి తన అను చరులతో కలిసి.. నగ్నంగా చేసి చిత్ర హింసలకు గురి చేసిన ఘటన జిల్లాలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో 9 మందిపై కేసు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బంగారిగూడకు చెందిన సయ్యద్ జహీర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ఓ యువతితో తరచూ మాట్లాడుతుండేవాడు. ఈ విషయాన్ని గమనించిన యువతి తండ్రి షేక్ ఇజాజ్ తన కూతురితో మాట్లాడొద్దంటూ జహీర్‌ను పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికీ అతని తీరులో మార్పు రాలేదు. దీంతో కోపోద్రిక్తుడైన ఇజాజ్.. గత జనవరి 8వ తేదీన పట్టణంలోని వినాయకచౌక్ వద్ద తన అను చరులతో కలిసి ఆటోలో జహీర్‌ను కిడ్నాప్ చేశాడు. ఆ తర్వాత తన స్నేహితుడైన షేక్ సలీం ఇంట్లో అతన్ని బంధించారు. అనంతరం యువకుడిని నగ్నంగా చేసి 9 మంది మూకుమ్మడిగా దాడి చేసి చిత్రహింసలు పెట్టారు. వీటిని వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి అవమానపర్చారు. ఈ విషయం పోలీసులకు చెప్తే చంపేస్తామంటూ బెదిరించి.. ఆ తర్వాత అతన్ని వదిలేశారు. దీంతో బాధితుడు జరిగిన ఘటనపై ఆలస్యంగా ఈ నెల 26వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోల ఆధారంగా 9మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో షేక్‌ఇజాస్, సోహెల్, షేక్ ముజీబ్, హసీబుల్లా, అమర్‌చౌష్, సయ్యద్ జుబేర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరించారు. వారి వద్ద నుంచి మూడుఆటోలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నా మన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు షేక్ సలీం, రాహేల్, సలీంలను సైతం త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. చట్టాన్ని ఎవరైనా చేతిలోకి తీసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సీఐ ఫణిదర్, ఎస్సై ముజాహిద్ తదితరులు ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ అందజేత

తలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఓ వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులు రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ చింతలపల్లి దేవా రెడ్డి వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

నేరడిగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరుకు కృషి చేస్తున్నామని ఎంఆర్ఐ నాగోరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారం గ్రామంలో రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. జాబి తాను ఉన్నతాధికారులకు నివేదికలను పంపా మన్నారు. అటవీ హక్కు పట్టాదారులు మరనిం చిన వారి వారసుల పేరున పట్టా మార్చుకునే వారు ఐటీడీఏలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

డోంట్‌వర్రీ.. తవ్వేసుకోండి!

(5వ పేజీ తరువాయి...)

అధికారులు అటువైపు కన్నెత్తిచూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మైనింగ్ వ్యాపారి సెటిల్‌మెంట్

కజ్జర్ల అసైన్డ్ భూముల్లో మొరం క్వారీలను అప్పగించడంలో ఓ మైనింగ్ వ్యాపారి కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. సంబంధిత కన్‌స్ట్రక్షన్ కంపెనీకి భూ యజమాని దళిత రైతు మధ్య ల్యాండ్ లెవలింగ్ డీలింగ్‌లో మైనింగ్ వ్యాపారి దళారిగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. మొదట భూ యజమాని నుంచి తక్కువ ధరకు మొరం క్వారీని కొనుగోలు చేసి.. ఆ తర్వాత బడా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి భారీ మొత్తంలో తీసుకుని అప్పజెప్పినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. భూ యజమానికి ల్యాండ్ లెవలింగ్ పేరిట ఒప్పందం చేసుకున్నారే తప్ప పని పూర్తయ్యాక చేతులెత్తేసే అవకాశం కనిపిస్తోంది. దీనికి అధికారుల అండదండలు తోడవడంతో అడిగే వారే కరువవుతున్నారు. అసైన్డ్ భూములు బొందలగడ్డలుగా మారుతున్న పట్టింపే లేకుండా పోయిందంటున్నారు.

ప్రభుత్వ దృష్టికి అడ్డగోలు దందా

తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలపై కొంతమంది అధికార పార్టీ నేతలు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త కథనంతో పాటు ప్రత్యేకంగా ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేద దళిత రైతులకు ఐదుఎకరాల చొప్పున అసైన్డ్ భూములను కేటాయించింది. ఇప్పటివరకు ఈ భూములు సాగులోకి రాకపోవడంతో మొరం క్వారీల పేరిట అడ్డగోలుగా అమ్మేసుకుంటున్నారు. అయినా సం బంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు పలువురు ముఖ్య నేతలకు ఆధారాలతో సహా నేరుగా ఫిర్యాదు చేస్తామని పేర్కొంటున్నారు.

అసెంబ్లీ తీర్మానంపై బంజారాల హర్షం

ఉట్నూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): బంజారాభాష 8వ షెడ్యూల్డుగా గుర్తిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మాణం చేయడంపై బంజారాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంజారా యువసేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్‌చంద్రకాంత్ నాయక్ ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3కి బదులు కొత్త జీవో వెంటనే ప్రభుత్వం ప్రకటన చేయాలని ప్రభు త్వాన్ని కోరారు.

'మన్నేవార్లకు కోలావార్ సర్టిఫికెట్లు ఇవ్వమనడం ఆక్షేపణీయం'

ఉట్నూర్, మార్చి28(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా ప్రాంతంలో ఉన్న మన్నే వార్లకు కోలావార్ సర్టిఫికెట్లు ఇవ్వాలని సిర్పూర్ కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడడం ఆక్షేపణీయమని ఆదివాసీ కోలాం సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టేకం వసంతరావు, ఉట్నూర్ మండల అధ్యక్షుడు సిడాం బాపురావులు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ శాసనసభ చివరి రోజు సమావేశంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదివాసీ కోలాం గిరిజనుల పై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవా లన్నారు. సమావేశంలో టేకం మాధవ్‌రావు, కడపలక్ష్మణ్, సిడాంలక్ష్మణ్, ఆత్రం బాపురావులు పాల్గొన్నారు.


రోడ్డుకు ఇరువైపుల చెట్ల కొమ్మల తొలగింపు

సోనాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం నుంచి టీవీటీ, జీడీపల్లె మీదు గా బోథ్‌కు వెళ్లే రహదారి మూలమలుపులు చెట్ల కొమ్మలు, ముళ్లపొదలతో ప్రమాదకరంగా మారాయి. తరుచూ వాహనదారులు ప్రమాదాలు భారీన పడడంతో గమనించిన నవనిర్మాణ్ సొసైటీ సభ్యులు రోడ్డుకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు, ముళ్లపొదలను శుక్ర వారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న పొదలను తొలగించడంతో గ్రామస్థులు వారిని అభినందించారు.



దాహం దాహం

నిర్మల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. పల్లె ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి విజిట్ పేరిట వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి బృందం తాగునీటి సమస్యపై స్పెషల్ డ్రైవ్‌రూపంలో వాస్తవాలను శోధించింది. ఈ సందర్భంగా పల్లె ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు అంతో ఇంతో కాదని తేలింది. పాలక వర్గాల గడువు ముగిసి స్పెషల్ అధికారుల చేతుల్లోకి పల్లె పాలన వచ్చినప్పటికీ ఎక్కడ కూడా తాగునీటి సమస్యపై సీరియస్ దృష్టి సారించడం లేదు. ప్రత్యేక అధికారులు గ్రామాలకు మొక్కుబడిగా వస్తూ పంచాయతీ రిజిస్టార్‌లలో సంతకాలకే పరిమితమవుతున్నారే తప్పా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రతీఏటా జనవరి ఫిబ్రవరి మాసాల్లోనే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టేవారు. దీని కోసం ప్రత్యేక యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించి దానికి అనుగుణంగా చర్యలు చేపట్టేవారు. ప్రభుత్వం కూడా తాగునీటి ఎద్దడికి నిధులు విడుదల చేసేది. మిషన్ భగీరథ పథకం అమలవుతున్నప్పటికీ నుంచి ఈ దిశగా సీరియస్ చర్యలు కరువయ్యాయన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గిరిజన తాండలు, గూడాల్లో పంట పొలాలకు వాడుకునే బోరు బావుల నుంచి తాగునీటిని వినియోగిస్తున్నారు. అలాగే చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోతుండడం అలాగే చాలా చోట్ల పైపులు చెడిపోవడం లాంటి సమస్యల కారణంగా ప్రజలు బోరు బావులనే ఆసరాగా చేసుకుంటున్నారు. అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ఆశించిన రీతిలో పని చేయకపోతుండడమే ప్రస్తుతం తాగునీటి సమస్యకు కారణమవుతోందని అంటున్నారు. ఇక్కడ తాగునీటి ఎద్దడిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించింది.



- గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి
- ముందస్తు చర్యలు లేకపోవడంతో ఇబ్బందుల్లో పల్లె ప్రజలు
- జిల్లాలో రోజు రోజుకు తీవ్రమవుతున్న సమస్య
- నిధులు లేక చేతులెత్తేస్తున్న పంచాయతీలు
- ప్రయోజనం లేని మిషన్ భగీరథ పథకం
- ఇప్పటికీ బోరుబావులు, వాగుల నీరే శరణ్యం

ఇంకా ఓపెన్ బావులే దిక్కు

ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా పల్లెలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నానని చెప్పుకుంటున్నప్పటికీ అది ఎక్కడ కూడా అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ప్రజలు ఓపెన్ బావుల నీరునే ఇంటికి తెచ్చుకొని తాగునీటికి ఉపయోగిస్తున్నారు. మామడ మండలంలోని రచ్చకోట గ్రామంలో అక్కడి ప్రజలు తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో మిషన్ భగీరథ పథకం పూర్తిగా ఫెయిల్ కావడంతో అక్కడి ఓ తోటలోని ఓపెన్ బావి నీరును తాగునీటి కోసం వినియోగిస్తున్నారు. అలాగే గొండుగూడ గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొద్దిరోజుల క్రితం వరకు సరఫరా అయిన మిషన్ భగీరథ నీరు పచ్చరంగుతో కూడి కలుషితంగా ఉండడంతో ఈ గ్రామస్థులు ఆ నీటిని తాగడం లేదు. ప్రత్యామ్నాయంగా వీరంతా ఓపెన్ బావి నీటినే వినియోగిస్తున్నారు. అయితే ఆ ఓపెన్ బావి కూడా క్రమంగా అడుగంటిపోతుండడం ఈ గ్రామస్థులను ఆందోళనకు గురి చేస్తోంది.

అస్తవ్యస్తంగా భగీరథ

జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ పథకం పూర్తిగా నిర్వీర్యమవుతోందన్న ఆరోపణలున్నాయి. చాలా రోజుల నుంచి మిషన్ భగీరథ పథకం నీరు రాకపోతుండడంతో రైతులు బోరుబావుల నుంచి సమీపంలోని వాగుల నీటిని తాగేందుకోసం వాడుకుంటున్నారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లి తాండలో మిషన్ భగీరథ నీరు ప్రతీరోజూ సరఫరాకాకపోతుండడంతో ఈ తండా సమీపంలో ఉన్నటువంటి పంట పొలాల కోసం ఏర్పాటు చేసుకున్న బోరు బావుల నుంచి తాగునీరును తీసుకువెళుతున్నారు. అలాగే అడెల్లి ఆలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన కులాయి నీటిని కూడా ఈ తండా వాసులు తీసుకువెళుతున్నారు. దస్తూరాబాద్ మండలంలోని రేవోజిపేట్ గ్రామంలో దాదాపు రెండేళ్ల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ఆ గ్రామస్థులకు ప్రత్యామ్నాయ నీటి సరఫరా చేయడం లేదు. తానూర్ మండలంలోని బెంబర్ గ్రామంలో మిషన్ భగీరథ నిర్వీర్యమైన కారణంగా అక్కడి రైతువేదిక దగ్గర గల బోరు నుంచి నీటిని తాగేందుకు తీసుకువెళుతున్నారు. అలాగే ముథోల్ మండలంలోని చింతకుంట తాండలో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఇక్కడ మిషన్ భగీరథ నీరు ఎప్పుడో ఓ సారి సరఫరా అవుతోందని ఈ నీరు కూడా లికేజీలతో వృధా పోతోందని తండావాసులు వాపోతున్నారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో కూడా మిషన్ భగీరథ పైప్‌లైన్ల లికేజీ కారణంగా తాగునీరు సక్రమంగా అందడం లేదు.

(మిగతా 8వ పేజీలో)


ముథోల్ మండలం చింతకుంటలో నిరుపయోగంగా మారిన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్

బాసర అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

బాసర, మార్చి, 28 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను శుక్రవారం అధికారులు లెక్కింపు చేపట్టారు. రూ. 53, 36, 176 నగదు, మిశ్రమ బంగారం 73 గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 100 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీలు 21 వచ్చినట్లు ఆలయ అధికారులు చెప్పారు. ఈ ఆదాయం మొత్తం 43 రోజుల్లో సమకూరింది. ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, ఏఈఓ సుదర్శన్‌గౌడ్, బ్యాంకు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాల్వ లక్ష్మీ నరసింహస్వామి

దేవస్థానం పూజ సామాగ్రి దుకాణం వేలం

దిలావర్‌పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీ కాల్వ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పూజసామాగ్రి దుకాణాన్ని ఒక సంవత్సర కాలానికి శుక్రవారం వేలం వేశారు. కాల్వ గ్రామానికి చెందిన ముష్టి వెంకటరమణ రూ. 3,01,500లు పాడి దుకాణాన్ని దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో భూమయ్య, పరిశీలకులు అరుణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉగాది రోజు కుభీర్‌లో కుస్తీ పోటీలు

కుభీర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విఠలేశ్వరస్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండగ రోజు కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుస్తీ పోటీలను మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభిస్తామన్నారు. మొదటి విజేతకు రూ. 5001, రెండవ విజేతకు రూ. 3001 నగదు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కుస్తీ పోటీలకు నియోజక వర్గ వాసులతో పాటు పొరుగు మహారాష్ట్ర గ్రామస్తులు, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం : ఎస్టీయూ

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఎస్టీయూ భవనంలో ఉదయం 9 గంటలకు కవి సమ్మేళనం, ఉర్దూ ముషాయిరా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక, కావేరి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే కవి సమ్మేళనానికి ఔత్సాహిక కవులు, రచయితలు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

కళాకారులకు సన్మానం



నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్మల్‌కు చెందిన కోటగిరి నర్సయ్యచారి, జున్ను అనిల్‌కుమార్‌ను నాటక సమాజం గురువారం సన్మానించారు. పలువురు వారిని ఈ సందర్భంగా అభినందించారు.

డైరీని ఆవిష్కరించిన కలెక్టర్


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వారి డైరీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంఘ సభ్యులతో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అసోసియేషన్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాబురావు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పుష్ప, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను మద్దతు ధరకే అమ్మండి

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు మొక్కజొన్న పంట ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే అమ్మాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225 పై సమావేశంలో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిందని మొదట 5 కేంద్రాలు వారంలోగా ప్రారంభిస్తామన్నారు. సారంగాపూర్, కుబీర్, భైంసా, నిర్మల్, ఖానాపూర్ కొనుగోలు కేంద్రాలు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా మరో వారంలో ప్రారంభించనున్నట్టు వివరించారు.

రైతు ఉద్యమంపై లాఠీచార్జ్ అమానుషం

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రంలో సంయుక్త కిసాన్‌మోర్చా చేస్తున్న రైతు ఉద్యమంపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. విలాస్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. దేశవ్యాప్త నిరసన జరుగుతోందని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. రైతు వ్యతిరేక చట్టలు రద్దు చేయలని, నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాలి, సోమేష్, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మే 20న నిర్వహించే జాతీయ సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హమాలీల 4వ జిల్లా మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్. విలాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోరాటాల ఫలితంగా సివిల్ సప్లై హమాలీల కూలీరేట్లు పెరిగాయన్నారు. కేంద్రం అమలు చేసే నాలుగు లేబర్ చట్టాలతో కార్మికుల హక్కులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. యూనియన్ బలోపేతానికి కలిసి కృషి చేయాలన్నారు. హక్కులు కాపాడుకోవలసిన బాధ్యత హమాలీలపై ఉందన్నారు. శ్రీనివాసాచారి, పుండలిక్, సాయి, భీమేష్, విఠల్, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలు కోడ్ చూసి తీసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ప్రశ్నాపత్రాలు పోలీసుస్టేషన్ నుంచి కోడ్ చూసి తీసుకోవాలని రాష్ట్ర పరిశీలకుడు టి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణ పోలీసుస్టేషన్ సందర్శించారు. సీఎస్, డీవోలకు సూచనలు చేశారు. జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లలో జాగ్రత్తగా పోస్ట్ చేయాలన్నారు.

గడువులోగా జీఎస్టీ పన్ను చెల్లించండి

నిర్మల్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ అమలులోకి వచ్చిన తొలి మూడు సంవత్సరాల సాంకేతిక కారణాలతో పన్ను చెల్లించని వారు ఈ నెల 31లోగా చెల్లించాలని జీఎస్టీ కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపాల్ కమిషనర్ సందీప్ ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. మూడేళ్ల పన్ను మందిపు చేసి చెల్లిస్తే దానిపై జరిమానా మాఫీ అవుతుందన్నారు. సకాలంలో చెల్లించి 30 జూన్ 2025లోగా జీఎస్టీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షలో భాగంగా గత పలు ఎన్నికల్లో పోలీసుశాఖ వారి సహకారం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ ప్రత్యేక ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ తీరుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా రాబోయే ఎన్నికలను నిర్వహించాలన్నారు. అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు అమలుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికి తమ పాత్ర పట్ల, విధుల గురించి పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. సజావుగా శాంతిభద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించామన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో ఎన్నికలను స్ఫూర్తితో మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని, ఓటింగ్ శాతాన్ని మరింత పెంచుతామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రబీసీజన్‌లో ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్


సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రబీ వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... వరి కొనుగోలు ప్రక్రియలు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియను చేపట్టే సిబ్బంది మొత్తం వరి కొనుగోలు ప్రక్రియపై పూర్తి అవగాహనను కలిగి ఉండాలన్నారు. ఓపీఎంఎస్ యాప్‌తో పాటు జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియలను సులభతరం చేసేందుకై ప్రత్యేకంగా రూపొందించిన లోకల్‌యాప్‌పై, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు టెంట్, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. సరిపడినన్ని గన్ని బస్తాలు, టార్పాలిన్లు, తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, తదితర పరికరాలన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో పాపయ్య, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠినచర్యలు

నిర్మల్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్‌మిల్లులపై కఠినచర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ నియమాలను పాటించని పలు రైస్ మిల్లుల యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి సమయానికి ధాన్యం అందించని రైస్ మిల్లర్లు, అధికారుల తనిఖీల్లో ధాన్యం నిల్వల్లో తేడాలు ఉన్న 9 రైస్ మిల్లులను జప్తు చేసి, చట్టప్రకారం కేసులను నమోదు చేసినట్టు తెలిపారు. ధాన్యానికి సంబంధించి 38 కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని, 20 ఎకరాల రైస్ మిల్లర్ల యజమానుల భూములను బ్లాక్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ధాన్యం బకాయి పడ్డ రైస్‌మిల్లర్లపై కఠినచర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

అగ్నివీర్‌కు ఎంపికైన నర్సాపూర్(జి) వాసి

నర్సాపూర్(జి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన పోసాని, రాములు దంపతుల కుమారుడు రాజశేఖర్ ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. తల్లి బీడీ కార్మికురాలు కాగా తండ్రి వ్యవసాయం చేస్తూ చదివించారు. రాజశేఖర్‌ను గ్రామస్థులతో పాటు మండల వాసులు అభినందించారు.

ప్రార్థన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

కుభీర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రహమాన్‌సాబ్ ఈద్గా ప్రార్థన స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రార్థన స్థలానికి వచ్చే మైనార్టీలకు ఇబ్బందులు కలగకుండా టెంట్‌లు, కుర్చీలు, తాగునీటి వసతిని కల్పించి ప్రార్థన స్థలాలకు వెళ్లే రోడ్డు మార్గంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి గౌతంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, మాజీ వైస్ ఎంపీపీ మోహియోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్లు


ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముథోల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్‌మాసంను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ముథోల్‌లోని సిద్ధిక్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరూక్ హైమద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివ కుమార్, ఎస్సై సంజీవ్, ట్రైనీ ఎస్సై శ్రావణి, ఈవో అన్వర్, నాయకులు అఫ్రోజ్ ఖాన్, ఎజాజ్, ఖలీద్, శ్రీనివాస్ గౌడ్, పోతన్న యాదవ్, మైనార్టీ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింల నిరసన


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఖానాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గాలని ఖానాపూర్‌లో ముస్లింలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు పిలుపు మేరకు శుక్రవారం ఖానాపూర్‌లోని మదీనా మస్జిద్‌లో ముస్లింలు చేతికి నల్లటి బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మదీనా మస్జిద్ ఇమామ్ ముక్తి అథర్ న్యాయవాదులు షబ్బీర్‌పాషా, సలీంఖాన్‌లు మాట్లాడుతూ... ఈ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, శ్మశాన వాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కుట్రగా వారు పేర్కొన్నారు. ఈ బిల్లును దేశంలోని ప్రతి ముస్లిం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లుపై వెనకడుగు వేయకుంటే ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు తమ నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ అధ్యక్షులు సయ్యద్ ఫహీం, ముస్లిం నాయకులు డా. చాంద్ పాషా, షాకీర్ ఉల్ ఖురాన్, సయ్యద్ ఆయుబ్, హబీబ్, షేక్అహ్మద్, మీర్జా బేగ్, సయ్యద్ మహమూద్, షేక్ షకీల్, ఖమర్, ఖలీక్, కలీం, అమీరుద్దీన్, సాబీర్, అఫ్రోజ్, తదితరులున్నారు.

కడెంలో శాంతియుత ప్రదర్శన


నల్లబ్యాడ్జీలతో శాంతియుత ప్రదర్శన చేస్తున్న ముస్లిం నాయకులు, యువకులు

కడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జామా మస్జిద్, మహమ్మదీయ మస్జిద్‌లలో శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం నల్ల బ్యాడ్జీలతో దేశంలో ప్రవేశపెడుతున్న వక్ఫ్‌బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

దాహం దాహం..


పెంబిలోని వాగు నుంచి ఎడ్ల బండిలో నీరు తెచ్చి నిల్వ చేసుకుని..


పెంబి మండలంలో నీటి కోసం బోరు దగ్గర ఎదురుచూస్తున్న గిరిజనులు

(7వ పేజీ తరువాయి)

ఊరందరికీ ఒకే బోరు దిక్కు.

దిలావర్‌పూర్ మండలం మాడేగాం అనుబంధ గ్రామమైన కదిలిలో ఆ ఊరి ప్రజలందరూ బోరుపై ఆధారపడి ఉన్నారు. ఆ ఒకే బోరు నుంచే ఊరందరూ తాగునీటి తిప్పలు తీర్చుకుంటున్నారు. ఈ గ్రామంలో మొత్తం 110 కుటుంబాలు ఉండగా సుమారు 500 పైగా జనాభా ఉంది. మిషన్ భగీరథ పథకం నీరు కొన్ని ఇళ్లకు మాత్రమే సరఫరా అవుతుండగా మిగతా ఇళ్లకు మాత్రం ఆ నీరు అందడం లేదు. ఇదిలా ఉండగా ఖానాపూర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో గత ఏడాది కాలం నుంచి నీటి సరఫరా వ్యవస్థ లేక అక్కడి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఎలాంటి నీటి సౌకర్యం లేకపోవడంతో వీరంతా నేషనల్ హైవే రోడ్డును దాటి కొమురం భీం చౌరస్తా నుంచి తాగునీటిని తెచ్చుకుంటుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని అంటున్నారు.

మారుమూల పల్లెల పరిస్థితి దయనీయం

పెంబి మండలంలోని అనేక మారుమూల పల్లెల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వస్‌పెల్లి, కొత్తగూడెం గ్రామా ల్లో తాగేందుకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో ఉన్న ఒకే ఒక్కబోరు బావిలో నీరు అడుగంటిపోయిన కారణంగా ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు. ఈ గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిక్‌మాన్ వాగులోని చెలిమే నుంచి తాగునీటిని తీసుకువచ్చుకుంటున్నారు. చాలా మంది నడుచుకుంటూ అలాగే మరికొంతమంది ఎడ్లబండ్లపై తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటివరకు ఈ గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వీరందరికీ చిక్‌మాన్ వాగు నీరే దిక్కవుతోంది. ఆ వాగులో కూడా నీరు ఎండిపోతుండడంతో ఇక చెలిమెలపైనే ఆధారపడుతున్నట్లు ఆ గ్రామస్థులు చెప్తున్నారు.

కరువైన ప్రత్యామ్నాయ చర్యలు

జిల్లాలోని మారుమూల పల్లె ప్రజలంతా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. గతంలో వేసవి కోసం తాగునీటి ఇబ్బందులను తీర్చేందు కోసం ముందస్తు చర్యలు చేపట్టేవారు. దీనికి సంబంధించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించే వారు. అయితే మిషన్ భగీరథ పథకం అమలవుతుందన్న సాకుతో ఈ ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు క్రమంగా విస్మరణకు గురవుతున్నాయి. అయితే అధికారులు ఊహిస్తున్నదానికి భిన్నంగా ఎక్కడ కూడా ఆ పథకం సక్రమంగా పని చేయడం లేదు. చాలా గ్రామాలకు ఈ పథకం ద్వారా నీటి సరఫరా జరగకపోతుండడం అలాగే చాలాచోట్ల ఈ పథకానికి సంబంధించిన పైప్‌లైన్‌లు ఇతర సామగ్రి చెడిపోవడంతో గ్రామాలకు నీటి సరఫరా నెలల నుంచి నిలిచిపోయింది. మరికొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ పథకం నీరు పచ్చరంగులో వస్తుండడం, దుర్వాసన వస్తుండడంతో గ్రామస్థులు ఈ నీటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటివరకు అధికారులు మాత్రం పకడ్బంధీ చర్యలకు సంబంధించిన కార్యచరణ చేపట్టడం లేదు.

ఆంధ్రజ్యోతి విజిట్


పెంబిలో చెలిమె నీరు తాగుతున్న గిరిజనుడు


పెంబి మండలంలో చెలిమె నీరు తీసుకెళ్తున్న మహిళలు



భానాపూర్ డబుల్‌బెడ్ రూం కాలనీలో కొమురంభీం చౌరస్తా నుంచి నీరు తెచ్చుకుంటున్న కాలనీవాసులు


నర్సాపూర్(జి)లోని సూర్య తండాలో పైప్‌లైన్ లీకేజీ దృశ్యం


నీటి కోసం బిందెలను వరుసలో పెట్టిన కాలనీవాసులు


చిక్‌మాన్ వాగులో నుంచి చెలిమె నీరుతీస్తున్న గిరిజనులు


కదిలి గ్రామంలో నీటి కోసం బోరుబావి వద్ద ప్రజలు


మామడ మండలం రచ్చకోట గ్రామంలో వ్యవసాయ బావి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న ప్రజలు

వట్టిపోయిన పెన్ గంగా..


అంతర్గం రేవు వద్ద పూర్తిగా ఎండి పోయిన పెన్‌గంగా నది

● రోజులు గడిచేది ఎలా..

భీంపూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): వేసవితాపానికి ముందే పెన్‌గంగాతోపాటు వాగులు, వంకలు ఎండు బారిపోయాయి. మూగజీవాలతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ ఏడాది దాహార్తి కష్టాలు తీరేలా లేవు. మరో రెండు నెలలు ముందు వేసవికాలాన్ని ఎలా భరిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే అదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అంతర్గం ప్రాంతంలోని పెన్ గంగా నది పూర్తిగా వట్టిపోయింది. బిందెడు నీళ్ల దొరకం కష్టంగా మారింది. ఈ ప్రాంతప్రజలకు ఈ నదీ జీవనాధారం. నది పూర్తిగా ఎండుబడటంతో మరో రెండు నెలలు ఎలా భరించేది అని ఈ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ పెన్‌గంగా నదితోపాటు మండలం లోని వాగులు, వంకలు పూర్తిగా ఎండు బారిపోయాయి. ఈ ప్రాంతప్రజలు నీటి కోసం ఇబ్బందులకు గురికావాలసి పరిస్థితులు నెలకొన్నాయి. ముందు వేసవికి ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేయాలని మండలవాసుకు కోరుతున్నారు. అలాగే మూగా జీవలకు సైతం తాగు నీటీ అవసరాలు తీర్చాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో ముగా జీవలు నీటి కోసం అల్లాడుతూ మృత్యువాత పడతయోమినని మూగజీవాల యజమాలు అందోళన వ్యక్తం చేస్తున్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్

ఆదిలాబాద్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోశాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబా ద్ కలెక్టరేట్ వద్ద రైతు సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈ దీక్షలో బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రైతులందరికీ రుణమాఫీ చెల్లించాలని, రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదన్నారు. హామీల అమలు చేత కాకపోతే తన పదవీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు చేసేంతవరకు బీజేపీ వారికి అండగా ఉండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాయల్ శరత్, వేదావ్యాస్, దయాకర్, ప్రఫుల్ పాల్గొన్నారు.

ఆదర్శం


అంగన్‌వాడీ సెంటర్‌లో సాగవుతున్న ఆకు కూరలు


చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్


సెంటర్‌లో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు

హరిత లోగిలిలో ఆ అంగన్‌వాడీ కేంద్రం

● అంగన్‌వాడీ కేంద్రంలో ఉట్టిపడుతున్న పచ్చదనం ● పిల్లల కోసం వంటకు అవసరమయ్యే ఆకు కూరల సాగు అక్కడే ● ఆదర్శంగా తరోడా అంగన్‌వాడీ సెంటర్

ముథోల్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఆ అంగన్‌వాడీ కేంద్రంలో ఎటూ చూసినా పచ్చదనం.. అందమైన పూల మొక్కలే దర్శనమిస్తున్నాయి. ఆరోగ్యాన్ని ఇచ్చే ఆకు కూరలూ సాగవుతున్నాయి. తరోడా అంగన్‌వాడీ కేంద్రం - 1 తమ కేంద్రానికి వచ్చే ప్రీ స్కూల్ పిల్లలకు కలుషితం కాని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆలోచన అంగన్‌వాడీ టీచర్ రేష్మకు తట్టింది. అంతే అనుకున్నదే తడవుగా తన ఆలోచనలను 1999 నుంచి ఆచరణలోకి తెచ్చి ఆదర్శంగా నిలుస్తోంది.

ముథోల్ మండలంలోని తరోడా అంగన్‌వాడీ సెంటర్-1 కేంద్ర ప్రాంగణంలో రకరకాల మొక్కలతో పచ్చదనం పరుచుకుంది. తమ పిల్లల భోజనానికి కావాలసిన ఆకుకూరలైన తోట కూర, గోంగూర, మెంతి కూర, బచ్చలి పాలకూర, చిక్కుడు, టమాట, వంకాయ, పుదీనా, కొత్తమీర, చామకూర, నిమ్మ, జామ, మామిడి, దానిమ్మలతోపాటు రకరకాల పూల మొక్కలను నాటి సంరక్షించడం మొదలు పెట్టారు. వారి కష్టానికి ఫలితం ఫలించింది. కొన్ని సంవత్సరాల నుంచి వాతావరణం ఇక్కడ అందరి చూపుల్నీ ఆకట్టుకుంటుంది. వీటి నుంచి భోజనంలోకి కావాల్సిన కూరలు ఆకుకూరలు తయారు చేసుకుంటూ సెంటర్‌కు వచ్చిన పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు సైతం ఆకు కూరలు వండి అందిస్తున్నారు. ఎటువంటి రసాయనం లేకుండా సేంద్రియ ఎరువులతోనే వీటిని పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


పచ్చదనంతో నిండుకున్న తరోడా అంగన్‌వాడీ సెంటర్

బొమ్మలు.. పలు రకాల చిత్రాలు

ఈ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చదవటం, రాయటం, ఆటలు, పాటలు, కథలు నేర్పిస్తూ చదువు నేర్చుకునేందుకు మానసికంగా సిద్ధం చేస్తున్నారు అక్కడి అంగన్‌వాడీ టీచర్. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న కలర్‌ఫుల్ బొమ్మలు, వివిధ రకాల జంతువుల చిత్రాలు ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతో చిన్నారులు ఆసక్తితో విద్యనభ్యసిస్తున్నారు. అంగన్‌వాడీ ఆవరణలో రంగు రంగుల బొమ్మలతో వివిధ రకాల చిత్రాలను రూపొందించారు. చిన్నారులు ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు, వేసవి కాలంలో ఉదయం 8 నుంచి 12:30 వరకు ఎంతో ఆహ్లాదంగా, సంతోషంగా గడుపుతున్నారు. చిన్నారులు ఇక్కడికి రాగానే ఇంటిని మరిచి పోయేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేశారు. ఈ సెంటర్ లో మొత్తం విద్యార్థులు 25 మందికి గాను రోజు 20 మంది పిల్లలు సెంటర్‌కు వస్తారని, ఆడుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు.

చదువుతో పాటు ఆటలు

ఇక్కడ సౌకర్యాలు చూసి చిన్నారుల తల్లిదండ్రులు పిల్లలను పంపేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. పిల్లలను ఇక్కడ చేర్పిస్తే వారికి చదువుతోపాటు ఆటలు, పాటలపై ఆసక్తి పెరిగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని అంగన్‌వాడీ టీచర్ పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు..

ఆహ్లాదకరమైన అంగన్‌వాడీ సెంటర్‌కు నూతన భవనం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ భవనం 1999లో నిర్మించారని, వర్షాకాలం స్లాబ్ పైకప్పు నుంచి వర్షపు నీరు వస్తోందని చెప్తున్నారు. అలాగే నూతన భవనంతో పాటు ప్రహరీ ఏర్పాటుకు కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.